క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట: మండలంలోని ఇసప్పాలెంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవాలయ పునర్నిర్మాణం కోసం పట్టణంలోని శ్రీనివాస డైమండ్ హౌస్ అండ్ జ్యూయలరీ ప్రొప్రయిటర్ ఆత్మకూరి జగన్‌మోహనరావు, వెంకట విజయలక్ష్మి దంపతులు రూ.2 లక్షల విరాళం సమర్పించారు. శనివారం ఆలయ కార్య నిర్వహణాధికారి టి.సుధాకర రెడ్డికి ఆయన కార్యాలయంలో దాతలు చెక్కును అందించారు. దేవస్థానంకు విరాళం ఇచ్చే దాతలకు ఆదాయపన్ను సెక్షన్ 80–జి కింద పన్ను మినహాయింపు ఉంటుందని ఈవో పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



నరసరావుపేట: ప్రతిభ చూపించిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500లు చొప్పున రూ.50 వేలు ఉపకార వేతనాలను బయో స్టాడ్ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. శనివారం కోటప్పకొండలోని త్రికోటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంపెనీ ప్రతినిధులు నాగభూషణరావు, రామబ్రహ్మం, డిస్ట్రిబ్యూటర్ కోట జానకిరామయ్య అందజేశారు. కార్యక్రమంలో గ్రామంలోని వెంకటకృష్ణా ఎంటర్ ప్రైజెస్ అధినేత ఏరువ రామగణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏజీఎం బాలకృష్ణారెడ్డికి ఘన సన్మానం



నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జీడీసీసీ బ్యాంకులో ఏజీఎంగా పదోన్నతి పొందిన బత్తుల బాలకృష్ణారెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. బ్యాంకులో వివిధ హోదాల్లో పనిచేసి ఖాతాదారులకు, రైతులకు విలువైన సేవలను బాలకృష్ణారెడ్డి అందించారని డీసీఓ, డీసీఏఓ యు.నాగ శ్రీనివాస్, దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఏజీఎంగా బాలకృష్ణారెడ్డి మరిన్ని సేవలు అందించి బ్యాంకు పురోభివృద్ధికి తోడ్పలన్నారు. శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రజిని, రమేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవికుమార్, లక్ష్మీ నారాయణ, లక్ష్మీ పసన్న, రమాదేవి, సీతవోలు పొలిమేర వెంకటరెడ్డి, కంటు శ్రీనివాస్, రామాంజనేయులు, రాంబాబు, రహీం, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించి తిరిగి పొందాలి



బొల్లాపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గ్రామ సమైఖ్య సంఘాలకు శనివారం ఏపీఎం రంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఏపీఎం మాట్లాడుతూ ఈ–బుక్ కీపింగ్‌పై ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా సీసీలు, గ్రామ సమైఖ్య సంఘాలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. నేటికి స్త్రీ నిధి రూ.1.81 కోట్లు, ఉన్నతి పథకంలో 834 మందికిగాను రూ.2.20 కోట్ల మేర నిధులు రుణాలు అందజేసినట్లు, వీటి రికవరీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రుణాలు చెల్లించిన వారు తిరిగి రుణాలు చెల్లించాలని, మండల స్థాయిలో 1556 గ్రూపులు, వాటి ఖాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో సీసీలు, వీ.ఓ.ఏ.లు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట



రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోవిందాంబ సమేత శ్రీమత్ విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్టా మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం విగ్రహ జీవధ్వజ స్తంభ, విమానశిఖర ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాలను నారాయణం వెంకట హనుమంతచార్యుల పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కేడర్లో జోష్

ఖాళీగా ఉన్న వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు వైఎస్సార్ సీపీ కేడర్లో జోష్‌ని పెంచాయి. వేర్వేరు మండలాల్లో వెల్లడైన ఈ ఎన్నికల ఫలితాలు అటు నేతలు, ఇటు కార్యకర్తలకు మరింత ఆనందాన్నిచ్చాయి. రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనకు ఈ ఫలితాలే నిదర్శనమంటూ పలువురు హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు

- ఉత్సాహాన్నిచ్చిన వార్డు ఉప ఎన్నికల ఫలితాలు
- సంబరాలు చేసుకున్న నేతలు, కార్యకర్తలు



బొమ్మరాజుపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో భారీస్థాయిలో సంబరాలు శనివారం నిర్వహించారు.1, 7 వార్డుల్లో ఉప ఎన్నికలు జరగడంతో రెండు వార్డుల్లో అనుకున్న విధంగానే మెజార్టీ సాధించడంతో జగనన్న పాలన ప్రజలను ఎంతో ఆదరిస్తుంది కాబట్టే ఈ గెలుపు సాధ్యమైందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ గెలుపొందాలని వైఎస్సార్ సీపీ నాయకులు కొండవర్జు నాగేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొండవర్జు ఎర్రయ్యలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ వద్ద నుంచి గ్రామంలో తప్పెట్లతో, బాణా సంచాతో ఊరేగింపు నిర్వహించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జగనన్న సారథ్యంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మరోసారి విజయం సాధిస్తారని, బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆయనకు పట్టం కడతారని హర్షం వెలిబుచ్చారు.

విప్పర్లపల్లిలో ప్రశాంతం..

రొంపిచర్ల: మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో శనివారం ఒకటవ వార్డు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆ వార్డులో మొత్తం 159 ఓట్లకు గాను 144 ఓట్లు పోలయ్యాయి. వార్డు మెంబరు పదవికి గాదె కొండారెడ్డి, గాదె రాఘవరెడ్డి పోటీచేశారు. వారిలో గాదె కొండారెడ్డికి 84 ఓట్లు రాగా, గాదె రాఘవరెడ్డికి 60 ఓట్లు పోలయ్యాయి. 24 ఓట్ల మెజార్టీతో వార్డు మెంబరుగా గాదె కొండారెడ్డి తన ప్రత్యర్థి గాదె రాఘవరెడ్డిపై గెలుపొందారు. అనంతరం వార్డుమెంబర్ గా గెలుపొందిన గాదె కొండారెడ్డికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.ఆంజనేయులు ఎన్నిక ధ్రువపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారి టి.రాఘవేంద్రప్రసాద్, అదనపు పోలింగ్ అధికారి సాంబశివరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం, నూజెండ్ల మండలాల్లో వార్డు మెంబర్లకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వినుకొండ రూరల్ మండలంలో దొండపాడు 5వ వార్డు జల్దీ చిన్నదానయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా హసన్నాయునిపాలెం 6వ వార్డుకు ఆచంట అనంత లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అదేవిధంగా నూజెండ్ల మండలం పాత నాగిరెడ్డిపల్లి గ్రామంలో 8వ వార్డు నాదెండ్ల శిరీష ఏకగ్రీవంగా ఎన్నికైంది.

ఈపూరు మండలంలో...

ఈపూరు: మండలంలో శనివారం జరిగిన మూడు వార్డుల ఉప ఎన్నికల్లో రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు, ఒక వార్డులో టీడీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. ఎన్నికల అధికారుల వివరాల మేరకు.. బొమ్మరాజుపల్లి గ్రామంలో గల 1వ వార్డులో 146 ఓట్లు ఉండగా మొత్తం 135 పోలయ్యాయని, వాటిలో బోయనబోయిన పెద సోమయ్యకు 106 ఓట్లు రాగా, కాటం చిన వెంకటేశ్వర్లుకు 29 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ బలపరిచిన పెదసోమయ్య 77 ఓట్ల మెజార్టితో గెలుపొందారు. 7 వార్డులో 146 ఓట్లకు మొత్తం 130 పోలయ్యాయని, 87 ఓట్లు పోర్ల నరసింహారావుకు రాగా, 42 ఓట్లు బాణావత్ చెన్నానాయక్, ఒక ఓటు చెల్లనట్లు అధికారులు ప్రకటించారు. ఇక్కడ వైసీపీ బలపరిచిన అభ్యర్థి పోర్ల నరసింహారావు 45 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉప్పరపాలెంలో 8 వార్డులో 124 ఓట్లు ఉండగా 105 ఓట్లు పోలయ్యాయని, మేకల లక్ష్మయ్య 58, సరిబోయిన బాలకృష్ణకు 44, 3 చెల్లని ఓట్లు, 14 ఓట్ల మెజార్టీతో తెలుగుదేశం పార్టీ బలపరిచిన మేకల లక్ష్మయ్య గెలుపొందారు. రూరల్ సీఐ ఎం. సుధాకర్, బొల్లాపల్లి ఎస్ఐ గల్లా రవికృష్ణ, ఈపూరు ఎస్ఐ ఫిరోజ్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

పంచాయతీ వార్డు సభ్యులు ఇద్దరు ఏకగ్రీవమే..

యడ్లపాడు: మండలంలో ఖాళీగా ఉన్న కోట, ఉప్పరపాలెం గ్రామాల్లోని రెండు పంచాయతీలు ఉప ఎన్నికల్లో ఏకగ్రీవం అయ్యాయి. కోట గ్రామం పంచాయతీలోని ఏడోవార్డు మెంబర్ బోరుగడ్డ శ్రావణి పంచాయతీ ఉపసర్పంచి వ్యవహరిస్తూ నర్సింగ్ పోస్టు రావడంతో రెండేళ్ల తర్వాత పదవికి రాజీనామా చేసింది. అలాగే వంకాయలపాడు పంచాయతీ ఉప్పరపాలెంలోని 9వవార్డు మెంబర్ పల్లపు సాంబశివరావు ఆర్నెల్ల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. నాటి నుంచి ఖాళీగా ఉన్న ఈ రెండు స్థానాలకు కోట పంచాయతీ ఏడో వార్డుకు సంతపేటకు చెందిన బోరుగడ్డ సరోజిని, వంకాయలపాడు పంచాయతీ 9వ వార్డుకు ఉప్పరపాలెంకు చెందిన పల్లపు కిషోర్ నామినేషన్లు వేశారు. రెండు స్థానాల నుంచి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో వాటిని రిటర్నింగ్ అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎంఈవో–1 నాగ రత్నం ఏకగ్రీవంగా ప్రకటిస్తూ నియామక పత్రం అందించారు. ఏకగ్రీవంగా నిలిచిన ఇద్దరిని ఆయా గ్రామాల నాయకులు అభినందించారు.



బోరుగడ్డ సరోజిని



బోయనబోయిన పెదసోమయ్య



పోర్ల నరసింహారావు



పాతనాగిరెడ్డిపల్లిలో నాదెండ్ల శిరీషకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

ఫ్లైఓవర్ పూర్తి చేయలేని బాబు రాజధాని కడతాడా?!

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- 11వార్డులో గడప గడపకు కార్యక్రమం



వార్డులో గృహవాసులకు పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: తనకు అధికారమిస్తే రాజధాని కడతానంటున్న చంద్రబాబు గతంలో ఐదేళ్లు అవకాశం ఇస్తే విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయానికి వెళ్లే ఫ్లైఓవర్ పూర్తిచేయ లేకపోయాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రకాష్‌నగర్ 11వ వార్డు 60 అడుగులరోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి వార్డు మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి, సానికొమ్ము రమణారెడ్డి సారథ్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఇంటింటికి తిరుగుతూ సంక్షేమపథకాలు అందుతున్న తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

స్థానిక సమస్యలను గురించి అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. వార్డుకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం అందజేసే నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో 11వ వార్డులో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.7 కోట్ల ప్రయోజనం చేకూరి నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబానికి ఒక లక్ష లబ్ధి చేకూరిందన్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలు అద్భుతంగా పనిచేస్తున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు. పింఛన్, రేషన్ ఒకటో తేదీనే ప్రతి గడపకు తీసుకొచ్చి అందజేస్తున్నారన్నారు. వార్డులో రూ.75 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తిచేశామన్నారు. మరో రూ.20 లక్షల వ్యయంతో మిగతా పనులు పూర్తిచేస్తామన్నారు. చంద్రబాబు వచ్చి అబద్ధాలు ప్రజలకు చెబుతున్నాడన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు రూ.26 వేల కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేశాడన్నారు. ప్రకాష్ నగర్‌లోని తిలక్ స్కూలును హైస్కూలు చేశామన్నారు. పదోతరగతికి చెందిన 80మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. పెద్దఎత్తున నాడు–నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేశారన్నారు. ఏరియా హాస్పిటల్ 200పడకల స్థాయికి పెంచి కోవిడ్ సమయంలో వేలమందికి వైద్యసేవలు అందజేశామన్నారు. గుండెనొప్పితో చనిపోతున్న వారిని నివారించేందుకు రూ.40 వేల విలువైన ఇంజక్షన్‌ను ఉచితంగా అందజేసే పథకాన్ని సీఎం జగన్ త్వరలో ప్రవేశపెట్టనున్నారన్నారు. గుండెనొప్పి వచ్చి నూటికి 38 మంది చనిపోతున్నారన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌ను మరో రూ.57 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తల నుంచి బాణాసంచా మోతలతో పూలతో బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం.స్వామి, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, కొమ్మసాని కమలాకరరెడ్డి, కామిరెడ్డి నరసిరెడ్డి, షేక్ అజీజ్, హాలీవుడ్ రఘు, గురుమూర్తి, పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సహాయం

చెక్కులు పంపిణీ చేసిన అడ్మిన్ ఎస్పీ



ఏఎస్ఐ భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అడ్మిన్ ఎస్పీ రాఘవేంద్ర

నరసరావుపేట: జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన ఏఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబానికి జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐ సతీమణి పుణ్యాల వెంకట రమణకు కార్పస్‌ఫండ్ రూ.1 లక్ష, విడో ఫండ్ కింద మరో రూ.50 వేల చెక్కులను అందజేశారు. ఏఎస్ఐ కుటుంబానికి శాఖాపరంగా రావాల్సిన మిగిలిన అన్నీ బెనిఫిట్స్ సకాలంలో అందజేస్తామని, భవిష్యత్‌లో పోలీస్‌శాఖ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏఎస్ఐ నరసరావుపేట టుటౌన్ పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 26 తేదీన మృతిచెందారు. ఏఏవో కేడీవీ రామారావు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

గురజాడ సేవలు యువతకు స్ఫూర్తి

కలెక్టర్ శివశంకర్



సాహిత్య మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు సమాజానికి అందించిన సేవలు నేటి యువతకు స్ఫూర్తి కావాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకాంక్షించారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నెలనెలా.. సాహిత్య మేళా కార్యక్రమంలో భాగంగా శనివారం గురజాడ అప్పారావు సాహిత్య, సామాజిక సేవ అంశంపై సాహిత్య మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యం, సామాజిక అంశాల పట్ల గురజాడ సేవలు స్ఫూర్తిగా నిలవాలన్నారు. క్రమశిక్షణ, దేశభక్తి, సాహిత్యం, పఠనాసక్తి, భాషపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న దురాచారాలు రూపుమాపేందుకు యువతను వైతాళికులు మాత్రమే చైతన్య పరచగలరని తెలిపారు. తొలుత కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌లు తెలుగుతల్లి, గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు దేశభక్తి గీతాలను ఆలపించి సభికులను చైతన్యపరిచారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, డాక్టర్ వి.ఎస్.ఎస్. అయ్యంగార్, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జన్మనక్షత్ర పూజలు



లక్ష మల్లెల అలంకరణలో అమ్మవారు

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ నక్షత్ర పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి లక్ష మల్లెపూలతో అలంకరించారు. మ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామానికి చెందిన బాదం వెంకటసుబ్బారావు, లక్ష్మీ శేషమాంబ దంపతులు ప్రసాదాల వితరణ చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పునరుద్ధరణ పనుల నిమిత్తం రూ. 2 లక్షల 116 రూపాయలు భక్తులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు–మస్తానమ్మ దంపతులు తమవంతు విరాళంగా అందజేసినట్లు వినుకొండ పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.

ఉపాధ్యాయులు 200 ప్లేట్లు వితరణ



గణిత శాస్త్ర ఉపాధ్యాయులు హనుమరెడ్డిని సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లోని గణితశాస్త్ర ఉపాధ్యాయులు నాగిరెడ్డి హనుమరెడ్డి తన వంతు సహాయంగా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు భోజనం చేసేందుకు అవసరమైన స్టీలు ప్లేట్లు రూ.15 విలువ చేసే 200 ప్లేట్లు వితరణ చేసినట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఆంగ్లబోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, రాధాకృష్ణ, నిర్మల, వసందరావు, గురుబాబు, పి.సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

వినుకొండ(నూజెండ్ల): విజయవాడ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలోత్సవ్ భవన్‌లో జరిగిన అంతర్జాతీయ ఫొటో కాంపిటీషన్‌లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మయ్య దిబెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా మరో ఫొటోగ్రాఫర్ కేసానుపల్లి సుబ్బారావుకు హానర్ అవార్డు లభించింది. ఇరువురికి అకాడమీ సభ్యులు, ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.

చేతుల అపరిశుభ్రతతో వ్యాధులు

చిలకలూరిపేట: చేతుల అపరిశుభ్రత కారణంగా వ్యాధులు సంక్రమిస్తాయని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకొనే ముందు రెండు, మూడు నిమిషాల పాటు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు.

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించండి

నరసరావుపేట టౌన్: ఖైదీలకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ అన్నారు. శనివారం సబ్‌జైలును సందర్శించిన ఆమె ఖైదులను ఉద్దేశించి మాట్లాడారు. సబ్‌జైల్‌లో పారిశుద్ధ్యం, అందించే వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్, మాదక ద్రవ్యాల నిరోధక చటాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలర్ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

మేజర్ కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఫానీ

నాదెండ్ల: కొద్దిపాటి వర్షానికే మురుగు కాల్వలు నిండి రోడ్లు బురదమయం అవుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి వెంబడి చెక్‌పోస్టు నుంచి కుప్పగంజివాగు వరకు ఉన్న ప్రధాన మురుగుకాలువలో పూడికతీత పనులు చేపట్టారు. ఇటీవల వర్షాలకు మురుగుకాలువలు నిండి సర్వీసు రోడ్లు జలమయమయ్యాయి. దీంతో స్థానికులు, వాహనచోదకుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో చర్యలు చేపట్టారు. సాధినేని చౌదరయ్య హెల్త్ క్లబ్, కొత్త మార్కెట్ యార్డు ఎదురుగా ప్రధాన డ్రైన్లలో ఉన్న పిచ్చిమొక్కలు, సిల్టును తొలగించారు. పట్టణంలోని కొంతభాగం మురుగునీరు కుప్పగంజివాగులో కలవాల్సి ఉండగా, కాలువలకు అడ్డుగా ఉన్న చెత్తా చెదారాలు తొలగించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, 15వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కోటా నాయక్, కౌన్సిలర్ రాజేంద్ర, భరత్ పరిశీలించారు.

నేటి నుంచి తాగునీటి సరఫరా నిలిపివేత

నరసరావుపేట: పట్టణంలో పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం ఆది, సోమవారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ నుంచి పట్టణానికి మంచినీటి సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు రావిపాడురోడ్డులోని కేబీఆర్ పార్కు వద్ద ఏర్పడిన లీకుల మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్‌లోని 10, 11, 12, 13, 14 వార్డులు, సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే ఒకటి, 34వ వార్డు, గుంటూరు కబేళాలోని వాటర్ ట్యాంకు ద్వారా 2, 3, 4, 5వ వార్డు ప్రజలకు తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. తిరిగి 21వ తేదీ సోమవారం సాయంత్రం సరఫరా యథావిధిగా ఉంటుందని చెప్పారు.

సర్వేపై పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోవాలి

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ కార్యక్రమాల సూచికలపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపిడిఓ షేక్ జిలానీబాషా మాట్లాడుతూ విద్య, వైద్యం, పంచాయతీరాజ్, నాడు–నేడు, మన ప్రభుత్వం కార్యక్రమాలపై సర్వే వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో ప్రభుత్వ సూచికల్లో సర్వే వెనుకంజ ఉన్న సర్వేను సిబ్బంది శ్రద్ధతీసుకొని జిల్లాస్థాయిలో ముందంజలో సాగేవిధంగా కృషి చేయాలన్నారు. పలు ప్రభుత్వ కార్యక్రమాల పనుల పురోగతి గురించి వివరించారు. స్పందన అర్జీలు, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ చేయూత, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సంక్షేమ విద్య ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రుల కార్యక్రమానికి అంకురారోపణ

వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమం ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలో గల సాయి బృందావనం (చిన్న షిరిడీ) నందు నవరాత్రుల కార్యక్రమానికి శనివారం అంకురారోపణ జరిగింది. ఈ సందర్భంగా హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో యాగ స్థలం శుద్ధి, ప్రక్షాళనం చేసి ఎద్దుల కావడికి పూజ చేసి నాగలితో నేలను దున్ని నవధాన్యాలు చల్లడం జరిగింది. ముత్తయిదువలతో పసుపు దంచే కార్యక్రమం చేశారు.

ఘనంగా దేవాలయ తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని నూజెండ్ల మండలంలో గల తలార్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నాగార్పమ్మా తల్లి దేవాలయ 7వ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ తిరునాళ్ల మహోత్సవానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లాకు స్వాగతం పలికి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా రామయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్‌లతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతి



కోదానయ్య (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కోదానయ్య (48) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన కోదానయ్యను ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ సాంబశివరావు, పలువురు పోలీస్ అధికారులు కోదానయ్య మృతికి నివాళులర్పించారు.

బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఆయాలు

నరసరావుపేట: చిన్న వయస్సులోనే బాలికలకు బాల్యవివాహాలు చేయటమనేది చట్ట రీత్యా నేరమని, దీంతో పాటు వారి ఆరోగ్యానికి ప్రతిబంధకంగా మారుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ బి.మాణిక్యాలరావు పేర్కొన్నారు. బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన నిమిత్తం శనివారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి బీసీ కాలనీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టారు పర్యవేక్షకులు టి.వెంకటరమణ, ఎం.వెంకటలక్ష్మి, షేక్ గౌస్య, ఎం.వాణి, షేక్ షరీన్ పాల్గొన్నారు.